8-7-99

సమరఘోషలో శాంతిని విస్మరిస్తున్నామా?

పాకిస్తాన్‌దే తప్పని కొంచెం సేపు అనుకుందాం. అప్పుడు భారత పౌరులుగా మన కర్తవ్యం ఏమిటి? పాకిస్తాన్ చేసిన తప్పు వల్ల ఈ రెండు దేశాల మధ్య అనవసరంగా నెలకొన్న యుద్ధ వాతావరణాన్ని శాంతివైపు మళ్ళించే ఆలోచన చేయడమా? లేకపోతే పాకిస్తాన్‌కు బుద్ధి చెపుదాం అని ఆవేశపడి యుద్ధ వాతావరణాన్ని మరింత తీవ్రతరం చేయడమా?

యుద్ధమంటే మనుషులకింత ఆవేశం ఎందుకొస్తుంది? మామూలుగా సాదాసీదాగా బతికే వాళ్ళు సైతం ఇంత ఉత్సాహం ఎందుకు చూపిస్తారు? ఇది 'దేశభక్తి' అని చెప్పుకుని గర్విస్తున్నాం. కానీ ఇది దేశభక్తా లేక ఒక శత్రువును భావించుకుని మనస్సునిండా నింపుకున్న ద్వేషభావంలో ఒకరితో ఒకరు మమేకం అయ్యే గుణమా? ఒక పరాయిదేశం మీద, జాతిమీద, ఏదయినా పరాయి సమూహం మీద ద్వేషం మనుషులను చాలా వేగంగా ఏకంచేస్తుంది. అందరూ ఒకటయి వాళ్ళను ఉమ్మడిగా ద్వేషించడంలో ఒక సంతృప్తితో కూడిన భద్రత ఉంటుంది. ఇది నైతికంగా ఏమంత గొప్ప గుణం కాదు గానీ దీనికి దేశభక్తి అని పేరు పెట్టుకొని మనం చాలా నీతిమంతులుగా అనుభూతి చెందుతున్నాం.

జూలై మూడవ తేదీన హైదరాబాద్‌లో చంద్రబాబు నాయుడు స్వయంగా నిర్వహించిన ప్రదర్శనను, అందులో పాల్గొన్న వాళ్ళు ఇచ్చిన నినాదాలను, చేసిన వ్యాఖ్యలను చూసిన వాళ్ళకు, విన్నవాళ్ళకు ఈ ప్రశ్నలు, సందేహాలు తోచకుండా ఉండవు. మన రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే అన్ని కార్యక్రమాలలాగ ఈ కార్యక్రమం కూడా విద్యార్థులకూ, అధ్యాపకులకూ కంపల్సరీ అయింది. నగరంలోని వివిధ కళాశాలల నుంచి, పాఠశాలల నుంచి వేల సంఖ్యలో హాజరయ్యారు. వీరితో పాటు తెలుగుదేశం నాయకులు సమీకరించగల ఇతర జనం కూడా ఆ నాటి 'కార్గిల్ ప్రదర్శన'లో పాల్గొన్నారు.

ఈ ప్రదర్శకులకయినా, వారిని ఉద్దేశించి ప్రసంగించిన ముఖ్యమంత్రికయినా యుద్ధం అవాంఛనీయం అన్న ఆలోచన తట్టలేదు. ఈ రెండు పేద దేశాలూ యుద్ధం చేసుకుని ఆర్థికంగా నాశనం కావడం ఎవరికీ మంచిది కాదన్న ఆలోచన తోచలేదు. చనిపోయిన జవాన్లకు జోహార్లు చెప్పడం కంటే ఈ నిరర్థకమైన చావులను ఆపే మార్గం అన్వేషించడం ముఖ్యమని వారికి అనిపించలేదు. పాకిస్తాన్‌ను వెనక్కి తరుముతాం, చొరబాటుదార్లను తరిమికొడతాం, భారత్ ప్రతాపాన్ని చూపిస్తాం అంటూ ఆవేశంగా నినాదాలు ఇచ్చారే కానీ ఇప్పటికే దాదాపు 40 శాతం జనాభా శరణార్థులుగా మారిన కార్గిల్ జిల్లా ప్రజానీకం దుర్గతి గురించి ఒక్క మాట మాట్లాడిన వారు లేరు. ఆనాటి ప్రదర్శకులకు కార్గిల్ ఒక భూభాగం మాత్రమే. ఆ భూభాగం మీద మమకారమే మన దేశభక్తి.

పైపైద్దగా లోతుల లోకి పోకుండా కూడా కనీస విజ్ఞత ఉన్న వారెవరైనా కార్గిల్ సరిహద్దు సంఘర్షణను వీలయినంత తక్కువ ప్రాణనష్టంతో పరిష్కరించే ప్రయత్నం చేయమని భారత ప్రభుత్వానికి హితవు చెప్పడం దేశ పౌరుల ప్రధాన కర్తవ్యమని గ్రహించగలిగి ఉండాలి. చాలా చదువుకున్న వాళ్ళు చాలా మంది పాల్గొన్న ఆ ప్రదర్శనలో ఈ ఆలోచన ఎవ్వరికీ తోచకపోవడాన్ని —తోచినా వ్యక్తం కాకపోవడాన్ని— ఏ విధంగా అర్థం చేసుకోవాలి? ఒక ఉమ్మడి శత్రువును ఉమ్మడిగా ద్వేషించడంలో పొందే ఆనందంలో విజ్ఞత నశించిందనుకోవాలా? వారి వారి జీవితాలలోని అన్ని వైఫల్యాలకూ, అన్ని రకాల చేతకానితనానికీ కార్గిల్‌లోని 'వీర జవాన్ల' విజయాలు, మనమందరం కలిసి తరిమితే తోక ముడిచి పారిపోతున్న పాకిస్తానీ సైనికుల ఊహాచిత్రం, ఉపశమనంగా పనిచేస్తాయనుకోవాలా? వ్యక్తిగత వైఫల్యాలకే కాక, ఒక దేశంగా అన్ని రంగాలలోనూ మనం పొందిన వైఫల్యాలకు మన తరఫున ఎవరో కొందరు సైనికులు మనకంటే చాలా చిన్న దేశం పురమాయించిన అర్థసైనికులపైన సాధిస్తున్న విజయం ఒక జాతీయ ఉపశమనంగా పనిచేసినట్టుంది.

జూలై 3 నాటి ప్రదర్శనలో స్కూలు పిల్లలు, కాలేజీ పిల్లలు చాలా మంది ఉన్నారు. వాళ్ళవి ఇంకా ద్వేషం నిండని మనసులు. ఈ రెండు దేశాలలోనూ పెద్దతరాన్ని బాగుచేయడం ఎవరి తరమూ కాదు. కానీ పిల్లలనయినా ద్వేషం నుంచి కాపాడగలిగితే వచ్చే తరంలోనయినా ఈ రెండు దేశాలూ సఖ్యంగా ఉండగలవేమో.

కానీ చంద్రబాబు నిర్వహించిన ప్రదర్శనలో పాల్గొన్న పిల్లల మీద ఆనాటి ప్రదర్శన ఏం ముద్ర వేసి ఉంటుంది? పాకిస్తాన్ అంటే శత్రువు. పాకిస్తాన్ అంటే ద్రోహం. పాకిస్తాన్ అంటే చౌర్యం. ద్వేషానికి బీజాలు బలంగానే నాటుకొని ఉంటాయి.

ఇటువంటి ప్రదర్శనలే పాకిస్తాన్‌లోనూ జరుగుతుంటాయి. చంద్రబాబు వంటి నాయకులు జరిపిస్తూ ఉంటారు. ఇండియా అంటే శత్రువు, ఇండియా అంటే కపటం అని ఇటువంటి పసిపిల్లలకే నేర్పిస్తూ ఉంటారు. ఇదే దేశభక్తి అయినట్టయితే ఈ రకమైన దేశభక్తికి అక్కడేం కరవు లేదు. ఒక తరం ఈ విధంగా మలితరానికి ద్వేషాన్ని అందిస్తూ పోతుంటే ఇంక సఖ్యత ఎప్పుడు సాధ్యం అవుతుంది? మన రాష్ట్ర ప్రభుత్వం స్వయంగా నిర్వహించిన ఈ ప్రదర్శనలో 'పాకిస్తానీ కుక్కలను వెనక్కి తరమండి' అన్న మాటలతో ఒక బ్యానర్ కట్టారు. ఇదంతా అయిపోయిన తరువాత చాలా కాలం దాకా పాకిస్తానీలంటే కుక్కలు అన్న అభిప్రాయం మాత్రం ఆనాటి ప్రదర్శనలో పాల్గొన్న స్కూలు, కాలేజీ పిల్లల మెదళ్ళలో నిలిచిపోతుంది. మన ముఖ్యమంత్రి చాలా గొప్ప వారసత్వాన్ని రాబోయే తరాలకు అందిస్తున్నారు.

రాజకీయ లబ్ధి కోసం ఏమైనా చేసే నాయకులను అనుకోవడం ఎందుకు? పత్రికలు, ప్రసార సాధనాలు చేస్తున్న నిర్వాకం ఏమిటి? వీర జవాన్లు, ఆత్మ బలిదానం, అమరత్వం —ఈ మాటలు అందించే భావన ఏమిటి? యుద్ధం ఇంకా ఇంకా జరగాలి, పాకిస్తాన్ పైన ఇంకా ఇంకా విజయాలు సాధించాలి అనే కదా? ఇంగ్లండ్‌లో వరల్డ్ కప్ పోటీలలో భాగంగా భారత —పాకిస్తాన్ టీమ్‌లు తలపడినప్పుడు 'ఇక్కడ కార్గిల్ సరిహద్దులో సంఘర్షణ జరుగుతుండగా అక్కడ మ్యాచ్ జరుగుతున్నది' అని వ్యాఖ్యానించని పత్రిక ఉందా? క్రికెట్‌లో యుద్ధం, టెన్నిస్‌లో యుద్ధం, అన్నిటిలోనూ యుద్ధాన్ని చూసేది దేశం మీద ప్రేమా లేక ద్వేషం మీద ప్రేమా? విద్వేషం మీద బతికే రాజకీయాలు ఈ రెండు దేశాలలోనూ కొంతకాలంగా బలపడుతున్నాయి. ఈ యుద్ధం ముగిసే నాటికి అవి రెండురెట్లు బలపడినట్టయితే దానికి పత్రికలు, ప్రసార సాధనాల బాధ్యత కూడా ఉండబోతుంది.

కార్గిల్ సమస్యకు నాంది పాకిస్తాన్ చర్యలేననుకుందాం. మనకు దుర్మార్గంగా, దౌర్జన్యంగా కనిపించే ఆ చర్యలకు చాలా అమాయకంగా కనిపించే వివరణ పాకిస్తాన్ ఇవ్వగలదు. భారత సైన్యం చేతిలో క్రూరమైన అణచివేత అనుభవిస్తున్న కాశ్మీరీలకూ, వారి పోరాటానికి తాను సహాయం చేయడంలో నైతికంగా తప్పేమీ లేదని పాకిస్తాన్ అనగలదు. పాకిస్తాన్ ప్రభుత్వం ఈ మాట పైకి అనకపోయినా పాకిస్తానీ పత్రికలు అనగలవు, అంటున్నాయి. మన పత్రికలు ఎంతటి ఉద్విగ్నతతో పాకిస్తాన్‌ను దుయ్యబడుతున్నాయో అంతటి ఉద్విగ్నతతోనూ పాకిస్తానీ పత్రికలూ, ప్రసార సాధనాలూ ఈ అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నాయి. ఆ అభిప్రాయాన్ని ఆమోదించే వాళ్ళు ప్రపంచంలో ఎవరూ లేరని మన మనుకుంటే పొరబాటే.

అయినప్పటికీ పాకిస్తాన్‌దే తప్పని కొంచెం సేపు అనుకుందాం. అప్పుడు భారత పౌరులుగా మన కర్తవ్యం ఏమిటి? పాకిస్తాన్ చేసిన తప్పు వల్ల ఈ రెండు దేశాల మధ్య అనవసరంగా నెలకొన్న యుద్ధ వాతావరణాన్ని శాంతివైపు మళ్ళించే ఆలోచన చేయడమా? లేకపోతే పాకిస్తాన్‌కు బుద్ధి చెపుదాం అని ఆవేశపడి యుద్ధ వాతావరణాన్ని మరింత తీవ్రతరం చేయడమా? నిజమే, వాస్తవాధీనరేఖ దాటి వచ్చిన చొరబాటుదార్లను వెనక్కి పంపించడం కూడా శాంతి నెలకొల్పే ప్రక్రియలో భాగమే. దానికోసం మన సైనికులు వారితో యుద్ధం చేయక తప్పదు. విధి నిర్వహణలో సైనికులు ఎదుర్కొనే ప్రాణాపాయానికి సానుభూతి చూపించగలం, చనిపోతే ఆ చావును గౌరవించగలం. కానీ ఆ గౌరవం నిజమైన గౌరవమయినట్టయితే నిరర్థకమైన ఆ చావులను ఆపే మార్గం మీద దృష్టి పెట్టాలి. ఆ చావులను నిరర్థకమైన, అవాంఛనీయమైన ప్రాణనష్టంగా కాక ఆత్మ బలిదానంగానూ, వీర మరణంగానూ చూడడం అందుకు భిన్నంగా యుద్ధం మరింతగా జరగాలనీ, మరిన్ని 'విజయాలు' సాధించి పాకిస్తాన్‌ను చిత్తుచిత్తు చేసేయాలనీ మనకు చెప్తుంది. ఈ సారి పాకిస్తాన్‌కు శాశ్వతంగా
లనీ, పనిలో పనిగా సరిహద్దురేఖను దాటి పాక్ ఆక్రమిత కాశ్మీర్‌ను తిరిగి ఆక్రమించుకోవాలనీ చాలామంది అదుపు తప్పి మాట్లాడుతున్న మాటలకు బలం ప్రసార సాధనాలు యుద్ధాన్ని వర్ణించడానికి ఉపయోగిస్తున్న మాటల నుంచి, చేస్తున్న వ్యాఖ్యల నుంచి లభిస్తుంది.

చాలామందికి అర్థం కాని విషయం ఏమిటంటే, వాస్తవాధీనరేఖను దాటి చొరబాటుదార్లను పంపిస్తున్న పాకిస్తాన్‌ను ప్రపంచంలోని అనేక దేశాలు విమర్శిస్తున్నది కేవలం ఆ మేరకు మాత్రమే. వాళ్ళు భారత్‌తో ఏకీభవిస్తున్నది కూడా కేవలం ఆ మేరకు మాత్రమే. కాశ్మీర్ సమస్య పట్ల భారత్ అనుసరిస్తున్న వైఖరి పట్ల ప్రపంచ దేశాలలో సానుభూతి ఎంతమాత్రం లేదు. కాబట్టి 'ఇదే అదను' అని మనం పాకిస్తాన్ భూభాగంలోకి ప్రవేశించి 'కాశ్మీర్ సమస్య'ను బలప్రయోగంతో పరిష్కరించేసుకుందామనుకుంటే ప్రపంచ దేశాలలో చాలా వ్యతిరేకత వస్తుంది.

అదట్లా ఉంచి యుద్ధం పట్ల మన వాళ్ళు చాలామంది ప్రదర్శిస్తున్న ఉత్సాహం ఇతరత్రా కూడా చాలా నష్టకరమైనది. 1971 తరువాత వాస్తవాధీనరేఖను దాటడానికి పెద్ద ఎత్తున ప్రయత్నమెన్నడూ చేయని పాకిస్తాన్ ఇప్పుడు చేయడానికి కారణం అణుబాంబు. సంప్రదాయక యుద్ధంలో భారత్‌కు తాను సరితూగదని పాకిస్తాన్‌కు చాలా కాలంగా తెలుసు. కానీ అణుబాంబు చేతిలోకి వచ్చిన తరువాత ఈ తూకాలకు అర్థం మారిపోతుంది. చిన్న దేశం కూడా పెద్ద విధ్వంసాన్ని సృష్టించగలదు కాబట్టి సంప్రదాయక యుద్ధ సామర్థ్యంలో తనకంటే బలమైన దేశాన్ని సైతం భయపెట్టగలదు. ఈ పరిస్థితి ఇవ్వాళ రావడానికి కారణం మన పాలకులు చేపట్టిన అణ్వాయుధ పరీక్షలే.

కానీ ఈ పరిస్థితిలో యుద్ధంవైపు దేశాన్ని నెడితే అది చాలా నష్టానికి దారితీయగలదు. అణుబాంబు ప్రయోగించాలనే నిర్ణయం తీసుకోగల ఉన్మాదులు ఈ రెండు దేశాలలోనూ ఉన్నారు. పిచ్చాసుపత్రిలో కాదు, పదవులలో ఉన్నారు. వాళ్ళను కారణంగా చూపించి తన సైన్యంతో రంగంలోకి దిగి తన ప్రత్యక్ష పర్యవేక్షణలో 'శాంతి' నెలకొల్పడానికి అమెరికా రెడీగా ఉంది. ఇరాక్‌లోనూ, యుగోస్లావియాలోనూ ఈ 'శాంతి'యుతమైన పెత్తనాన్ని అమెరికా ఈ మధ్యనే రుచి చూసి ఉంది. యుద్ధం పట్ల మనవాళ్ళందరూ ప్రదర్శిస్తున్న ఉత్సాహం దానికి మార్గం సుగమం చేయగలదు.

కనీసం అందువల్లనైనా కొంచెం శాంతిద్దామా?

—కె. బాలగోపాల్